సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 21 । డిసెంబర్ । 2023



రాముని అక్షింతల శోభాయాత్ర

వేములవాడఅర్బన్: అయోధ్యరామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు బుధవారం శోభయాత్రగా తీసుకొచ్చారు.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లోని రాజన్నకు చెందిన 20 కోడెలను మహబూబాద్ జిల్లా పెద్దవంగరలోని శివశంకర్ గోశాలకు అందజేశారు.

గరిష్టం/కనిష్టం
27.0/14.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇల్లంతకుంట పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం ప్రేమలత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట ప్రభుత్వ పాఠశాలకు రాష్ట్రస్థాయి గోల్డెన్ అవార్డు లభించింది. ఎనర్జీ కన్జర్వేషన్ విభాగంలో భాగంగా 2023 సంవత్సరానికి అవార్డు దక్కినట్లు హెచ్‌ఎం ఎం.ప్రేమలత తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు. రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి చందన్‌మిత్ర, టీఎస్ రెడ్కో వీసీఎండీ జానయ్య, ఎన్‌పీసీ రీజినల్ డైరెక్టర్ హేమంత్‌కుమార్‌రావు, నోడల్ అధికారి వి.మహేశ్‌చంద్ర, విద్యార్థినులు తిప్పారపు నందిని, శరణ్య పాల్గొన్నారు.

యాసంగికి ఎగువమా'నీరు'



నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ ఈఈ

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు కింద యాసంగిలో 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు అధికారులు నిర్ణయించారు. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల ప్రతినిధులు, ఇరిగేషన్‌శాఖ ఈఈ అమరేందర్‌రెడ్డి, డీఈ నర్సింగ్ ఆధ్వర్యంలో బుధవారం సమీక్ష నిర్వహించి, ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈనెల 25న కుడి ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నారు. నర్మాల సర్పంచ్ ఎడబోయిన రాజు, మానేరు నీటిసంఘాల మాజీ చైర్మన్ వంగ సురేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో వర్ల గోదాంలు ఖాళీ చేయాలి



టెక్స్‌టైల్ పార్కు ఏడీకి వినతిపత్రం అందిస్తున్న రమణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): టెక్స్‌టైల్ పార్కులో మూతబడ్డ పరిశ్రమలను యజమానులు వర్ల గోదాములుగా మార్చడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే ఆ గోదాములను ఖాళీ చేయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈమేరకు టెక్స్‌టైల్ పార్క్ ఏడీకి బుధవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గతంలో యజమానులకు నోటీసులు పంపించారని.. కానీ ప్రస్తుతం పాత గోదాములను ఖాళీ చేయకపోగా మరికొన్ని పరిశ్రమలను కూడా గోదాములుగా మార్చారన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి



టీపీటీఎఫ్ నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యారంగంలోని సమస్యలను ప్రభుత్వ పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. గంభీరావుపేటలోని కేజీ టు పీజీ విద్యాసంస్థలతోపాటు పలు పాఠశాలలను బుధవారం సందర్శించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందన్నారు. కేజీ టు పీజీలోనే 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే మిగతా చోట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాంనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి హన్మండ్లు, కౌన్సిలర్ నరేందర్, మండలాధ్యక్షుడు ప్రకాశ్, కార్యదర్శి బాలరాజు, నాయకులు రాజేందర్, కృష్ణ, చైతన్య, శ్రీనివాస్, వేణు పాల్గొన్నారు.

'విలీన'బంధం వీడేనా?

- సిరిసిల్ల మున్సిపల్ నుంచి పల్లెలకు విముక్తి కలిగేనా?
- మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం కోరిన ఎమ్మెల్యే కేటీఆర్
- బాండ్‌పేపర్ రాసిచ్చిన కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి
- సిరిసిల్లలో ఆసక్తికరమైన చర్చ
- వేములవాడలోనూ ఐదు ఊర్లది ఇదే సమస్య



సర్దాపూర్ ఊరు కూడలి

'సిరిసిల్ల పట్టణంలో విలీనమైన ఏడు గ్రామాలకు మినహాయింపునిస్తూ.. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి, ప్రభుత్వానికి పంపండి. ఆ ఏడు గ్రామాలు సిరిసిల్ల నుంచి విడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. అందరితో చర్చించి మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించి పంపితే ప్రభుత్వం పరిశీలిస్తుంది...' అని సిరిసిల్ల ఎమ్మెల్యే, కేటీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళకు మంగళవారం సూచించారు.





'రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, సర్దాపూర్ గ్రామాలను సిరిసిల్ల మున్సిపల్‌లో బలవంతంగా విలీనం చేశారు. మున్సిపల్ నుంచి వేరు చేసి గతంలో మాదిరిగా ఆ పల్లెలను గ్రామపంచాయతీలుగా ఉంచేలా కృషి చేస్తాను. మీ ఏడు గ్రామాల ప్రజల ముంగిట ప్రమాణం చేస్తున్నాను...' అని నవంబరు 28న సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి బాండ్ పేపర్ రాసిచ్చారు.

సిరిసిల్ల: సిరిసిల్ల 2016లో అక్టోబర్‌లో జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. అయితే సిరిసిల్ల పట్టణ జనాభా 83 వేల వరకు ఉంది. లక్ష జనాభా ఉంటే ద్వితీయశ్రేణి మున్సిపాలిటీల జాబితాలో చేరడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు సమకూరి.. అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో సిరిసిల్లలో ఏడు గ్రామాలను 2018లో విలీనం చేశారు. ఫలితంగా 33 వార్డులుగా ఉన్న సిరిసిల్ల మున్సిపాలిటీ 39 వార్డులుగా మారింది. అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు చొరవతోనే ఏడు గ్రామాలు మున్సిపల్‌లో కలిపారు.

కోర్టుకెక్కిన పల్లెలు

సిరిసిల్ల పట్టణంలో విలీనమైన ఏడు గ్రామాల తరఫున పెద్దూరు, సర్దాపూర్ వాసులు హైకోర్టును ఆశ్రయించారు. అప్పట్లో ఆయా గ్రామాల ప్రజలు సిరిసిల్లలో విలీనాన్ని వ్యతిరేకించారు. ×పల్లెలను చంపేస్తారా.. పట్టణీకరణ పేరిట పంచాయతీలను పట్టణాల్లో కలిపేస్తారా?₹ అంటూ న్యాయస్థానం విలీన పల్లెల పిటిషన్లపై ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కానీ చివరికి ప్రభుత్వ వాదనతో ఏకీభవిస్తూ ఏడు గ్రామాల విలీనం పూర్తయింది. ఆ పల్లెల్లో పదేళ్ల వరకు ఎలాంటి ఆస్తిపన్నులు పెంచబోమని, వేగంగా అభివృద్ధి చేస్తామని విలీన సమయంలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

అభివృద్ధి అంతంతే..

సిరిసిల్లలో విలీనమైన ఆ ఏడు గ్రామాల్లో అభివృద్ధి పనులు గత ఐదేళ్లలో అంతంతమాత్రంగానే జరిగాయి. ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ భవనాలు వార్డు అభివృద్ధి కేంద్రాలుగా మారాయి. గ్రామపంచాయతీ రికార్డులను మున్సిపల్‌కు అప్పగించారు. ఆ పల్లెల్లో పనిచేసే సిబ్బందిని సైతం మున్సిపల్‌లో కలిపేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అమలుచేసే ఉపాధిహామీ పథకం ఆ ఏడు గ్రామాలకు దూరమైంది. మున్సిపల్ నుంచి విడదీసి ఏడు గ్రామాలతో సిరిసిల్ల అర్బన్ మండలాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఆందోళనకు దిగారు. మొత్తంగా సిరిసిల్లలో విలీనమైన ఆ పల్లెల్లో ఒకరకమైన వ్యతిరేకభావం నెలకొంది.

వేములవాడలో తెరపైకి డిమాండ్

వేములవాడలోనూ ఇలాగే తిప్పాపూర్, అయ్యోరుపల్లె, కోనాయపల్లె, శాత్రాజుపల్లె, నాంపల్లి గ్రామాలను బలవంతంగా విలీనం చేశారు. ఆ గ్రామీణ ప్రజలు కూడా ప్రత్యేకంగా గ్రామాలుగా ఉండాలని కోరుకుంటున్నాయి. సిరిసిల్లలో విలీనబంధం వీడితే.. అక్కడ కూడా ఇదే డిమాండ్ తెరపైకి వస్తుంది.

కౌన్సిల్‌లో తీర్మానం జరిగేనా?

సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్‌లో విలీన గ్రామాలను వేరు చేస్తూ తీర్మానం జరుగుతుందా? అనే అనుమానాలు ఉన్నాయి. ఇప్పటికే మున్సిపల్‌లో కలిసిన గ్రామాల్లో రియల్ ఎస్టేట్ భూమ్ వచ్చింది. మళ్లీ ఆ గ్రామాలు పంచాయతీలుగా మారితే రియల్ ఎస్టేట్ పడిపోతుంది. పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు ఆయా గ్రామాల్లో భూములపై పెట్టుబడులు పెట్టారు. విలీనబంధం విడిపోతే ఏడు గ్రామాలు దూరమై సిరిసిల్ల పట్టణ జనాభా తగ్గిపోయి మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం పడిపోతుంది. ఇలాంటి కారణాలతో కౌన్సిల్‌లో ఏకాభిప్రాయం సాధ్యమవుతుందా? అనే సందేహాలు ఉన్నాయి. ఒక వేళ కౌన్సిల్ తీర్మానం చేసినా.. ప్రభుత్వ స్థాయిలో ఆమోదం లభిస్తుందా? అనే అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు సిరిసిల్లలో విలీన గ్రామాల అంశం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

కౌన్సిల్‌లో చర్చించి తీర్మానం చేస్తాం

"మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సిరిసిల్ల ఎమ్మెల్యే తారకరామారావు విలీన గ్రామాలను వేరు చేస్తూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. కేటీఆర్ సూచనలతో సిరిసిల్లలో విలీనమైన ఏడు గ్రామాలను తొలగించాలనే తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తాం.



– జిందం కళాచక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, సిరిసిల్ల

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం చేయండి

- తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించండి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికలకు తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని, ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి బుధవారం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందునా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఫారమ్–6, 7, 8 లను పరిశీలించి, పరిష్కరించాలని తెలిపారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు.

పిల్లల్లో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

- జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్
- ముగిసిన కేజీబీవీ విద్యార్థుల క్రీడాపోటీలు

సిరిసిల్ల: ప్రాథమిక స్థాయిలోనే పిల్లల్లోని క్రీడా నైపుణ్యాన్ని గుర్తించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్ల శివారులోని మినీస్టేడియంలో కేజీబీవీ పాఠశాలల విద్యార్థుల క్రీడల ముగింపు వేడుకలు బుధవారం జరిగాయి. డీఈవో మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రోత్సహించాలని సూచించారు. ఆటలతో శారీరక, మానసిక వికాసం పిల్లలకు లభిస్తుందన్నారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ అంగన్‌వాడీ స్థాయిలోనే ఆటపాటలతో పిల్లలను స్కూల్‌కు సన్నద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించా రు. జిల్లా క్రీడల అధికారి అజ్మీరా రాందాస్, విద్యాశాఖ అధికారి పద్మజ, మహిళా కో–ఆర్డినేటర్ రోజా, సుచరిత, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవత ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా హక్కులపై అవగాహన అవసరం

- వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి రవీందర్



మాట్లాడుతున్న న్యాయమూర్తి రవీందర్

వేములవాడరూరల్/వేములవాడఅర్బన్: మహిళా హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి రవీందర్ పేర్కొన్నారు. వేములవాడలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి రవీందర్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుంచి రక్షణ, గృహహింసచట్టం, మహిళా సాధికారత, ర్యాగింగ్ నుంచి రక్షణ వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా, శిశుసంక్షేమ శాఖ అందించే రక్షణ చర్యలను డీడబ్ల్యూవో లక్ష్మీరాజం వివరించారు. ప్రిన్సిపాల్ పద్మజ, న్యాయవాదులు కె.శ్రీనివాస్, సీహెచ్.సంజీవని, బి.ప్రశాంత్‌కుమార్, గంగరాజు, మహేందర్, మహేశ్, సీడీపీవో సుచరిత పాల్గొన్నారు.

సమర్థవంతమైన విధులతో మన్ననలు

- ఎస్పీ అఖిల్‌మహాజన్

వేములవాడరూరల్: జిల్లా పోలీస్‌శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇటీవల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినప్పుడు సిబ్బంది తమకు విశ్రాంతి గదులు లేవని ఎస్పీ దృష్టికి తేవడంతో గదులను నిర్మింపజేశారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం విషయంలో అధిక ప్రాధాన్యతనివ్వడం ద్వారా మరింత సమర్థంగా విధులు నిర్వహిస్తారన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కృష్ణకుమార్, ఎస్సై మారుతి ఉన్నారు.



విశ్రాంతి గదులు ప్రారంభిస్తున్న ఎస్పీ

ప్రమాదాల నివారణకు చర్యలు

సిరిసిల్లక్రైం: ప్రమాదాల నివారణకు, ఓవర్‌స్పీడ్ నియంత్రణకు జిల్లాలోని ప్రధాన రహదారులు, ప్రమాదాలు ఎక్కువ జరిగే జంక్షన్ల వద్ద విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని రగుడుచౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పెట్రోకార్, బ్లూకోల్ట్ సిబ్బంది విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రమాదాల నివారణకు ఇలాంటి విధానాలు అవలంభిస్తున్నారని తెలిపారు. ఓవర్‌స్పీడ్‌తో వచ్చే వారికి, మద్యం సేవించి వచ్చే వాళ్లు ఈ విగ్రహాన్ని చూసి పోలీసులున్నారన్న భావనతో నిబంధనలు పాటిస్తారని పేర్కొన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ ఉపేందర్, ట్రాఫిక్ ఎస్సై రాజు పాల్గొన్నారు.



త్రీడీ పెట్రోకార్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

సిరిసిల్ల: ఆరోగ్యమే మహాభాగ్యమని, పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. సర్దాపూర్‌లోని పోలీస్ బెటాలియన్‌లో బుధవారం సిరిసిల్ల కోణార్క్ ఆస్పత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ విక్రమ్‌సింహారెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కమాండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసుల విధులు మిగతా ఉద్యోగులతో పోల్చినప్పుడు భిన్నంగా ఉంటాయన్నారు. ఎప్పుడు పడితే అప్పుడు విధుల్లో ఉండాల్సి రావడంతో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారన్నారు. వ్యాయామం, యోగాతో ఆరోగ్యంగా ఉండాలన్నారు. పోలీస్ బెటాలియన్ సిబ్బందికి నరాల బలహీనత, వెన్నెముక, మెదడు రుగ్మతల గురించి డాక్టర్ విక్రమ్‌సింహారెడ్డి అవగాహన కల్పించారు. వివిధ రకాల పరీక్షలు చేసి, నివారణ మార్గాలు సూచించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఏజేపీ నారాయణ, ఎం.పార్థసారథిరెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కరోనాను ఎదుర్కొంటాం..

- జిల్లా వైద్యశాఖ అప్రమత్తం
- ఆస్పత్రుల్లో బెడ్లు సిద్ధం
- అందుబాటులో మందులు, ఆక్సిజన్ ప్లాంట్
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యాధికారులు
- మాస్క్ మస్ట్ అంటున్న అధికారులు



జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ట్యాంకు



జిల్లా ఆస్పత్రిలో కోవిడ్ ఐసీయూ

సిరిసిల్లటౌన్: కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తోంది. కేరళ రాష్ట్రంలో అతివేగంగా వైరస్ విస్తరిస్తోంది. పాజిటివ్ కేసులు అత్యధిక సంఖ్యలో నమోదవుతుండడంతో జిల్లాలో భయాందోళన మొదలైంది. రాజన్నసిరిసిల్ల జిల్లాను కరోనా సెకండ్‌వేవ్ అతలాకుతలం చేసింది. ప్రతీ కుటుంబంలో వైరస్ బాధితులు ఉన్నారు. ప్రతి ఊరిలో కరోనా మృతులు ఉన్నారు. అంతలా విలయతాండవం చేసిన వైరస్ మళ్లీ విస్తరిస్తుందన్న వార్తలతో జిల్లా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో జిల్లా వైద్యశాఖ అప్రమత్తమైంది. జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో కరోనా వార్డును అన్ని వసతులతో సిద్ధం చేసింది. గతంలోనే శిక్షణ తీసుకున్న సిబ్బంది సైతం సిద్ధంగా ఉన్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని భరోసానిస్తున్నారు.

సర్కారు ఆస్పత్రుల్లో సకల వసతులు

కరోనా బాధితులకు చికిత్స అందించేలా జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో వసతులు ఉన్నట్లు వైద్యశాఖాధికారులు తెలిపారు. గతంలో కరోనా బారిన పడిన వారు అత్యధిక మంది ఇంట్లోనే చికిత్స పొందారు. అత్యవసర పరిస్థితుల్లోనే ఆస్పత్రులకు వచ్చారు. కొత్తగా వ్యాపిస్తున్న జేఎన్–1 వేరియంట్‌తో మరణాలు నమోదవడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు.

మందులు సిద్ధం

కోవిడ్ రోగులకు ఇచ్చేందుకు పారాసిటమాల్, డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్, ఓసెల్టమవిర్, టోకిలిజుమాబ్, మెథిల్ ప్రిడ్నిసోలోన్, డెక్సామెథాజోన్, ఎనోక్సపరిన్, అంఫోటెరిసిన్, ఐవీఐజీ, పోసాకోనజోల్ మందులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా ఆసుపత్రిలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్‌తోపాటు ఈసీజీ, హెచ్‌ఆర్‌సీటీ స్కానింగ్, 2డీ ఏకో, అల్ట్రాసౌండ్, మొబైల్ ఎక్స్‌రేలు మిషన్లు 4 ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కరోనా రోగులకు అందించేందుకు 170 బల్క్ ఆక్సిజన్ సిలిండర్లు, 500 ఎల్‌పీఎం కెపాసిటీతో రెండు ఆక్సిజన్ ఉత్పత్తి ట్యాంకులు, 6000 ఎల్‌వోటీ సామర్థ్యం గల ఆక్సిజన్ నిలువ ట్యాంకు ఉంది. ఐసీయూలో 8 వెంటిలేటర్లు, బైటాప్ మిషన్స్, హెచ్‌ఎఫ్‌ఎల్‌సీ మిషన్లు కలిగిన 10 బెడ్లతో ప్రత్యేకవార్డు ఉంది. పీపీఈ కిట్లు, రోగులకు ఇచ్చే కోవిడ్‌కిట్లు అందుబాటులో ఉంచారు.

వైద్య, ఆరోగ్యశాఖ మాక్‌డ్రిల్

జిల్లాలో కరోనా కట్టడి, చికిత్సకు వైద్య, ఆరోగ్యశాఖ మాక్‌డ్రిల్ నిర్వహించింది. ఈమేరకు రిపోర్టును రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖకు అందించింది. కరోనాకు అందించాల్సిన వైద్యసేవలను వివరించింది. అన్నిరకాల అంబులెన్స్ సర్వీసులతోపాటు టెలీమెడిసిన్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- కరోనా కొత్త వేరియంట్ జేఎన్–1 విస్తరణ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.
- స్వీయ నియంత్రణ పాటించాలని సూచిస్తున్నారు.
- గుంపులుగా కలువకూడదని, కొత్త ప్రదేశాలు, టూర్లు పోయివచ్చిన వారికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.
- సామాజికదూరం పాటించాలని, మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు.
- శానిటైజర్లు వినియోగించాలని, తరచూ చేతులను సబ్బుతో కడుక్కోవాలని సూచిస్తున్నారు.
- ఎవరిలోనైనా కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య, ఆరోగ్యశాఖకు తెలపాలంటున్నారు.

2023, జూన్ వరకు జిల్లాలో కరోనా వివరాలు

పాజిటివ్ కేసులు	37,232
రికవరీ కేసులు	36,556
మరణాలు	676
టీకా ఫస్ట్‌డోస్	4,80,760
టీకా రెండోడోస్	4,76,093
బూస్టర్ డోస్	1,18,207

జిల్లా ఆస్పత్రిలో వసతులు ఇలా..

బెడ్లు	630
వెంటిలేటర్లు	44
నెబులైజర్స్	64
ఆక్సీమీటర్లు	124
ఆక్సీజన్ కాన్సన్‌ట్రేటర్స్	169
ఆక్సీజన్ సిలిండర్లు	231
పీపీఈ కిట్లు	2,335
వైద్యులు	69
వైద్యసిబ్బంది	288
హెల్త్‌స్కీమ్ వర్కర్స్	834

సేవలందించేందుకు సిద్ధం



కొత్త వేరియంట్ జేఎన్–1 విస్తరణ నేపథ్యంలో తీసుకోవాల్సిన గైడ్‌లైన్స్ పూర్తిగా రాలేదు. కాకపోతే ఏ సమయంలోనైనా చికిత్స అందించేందకు ఆస్పత్రి వైద్యసిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఎమర్జెన్సీలో అందించే చికిత్స, మందులు అందుబాటులో ఉన్నాయి. రెమిడెసివర్ ఇంజక్షన్లను మినహాయిస్తే గతంలో కోవిడ్–19 చికిత్సకు అందించిన మందులు అన్నీ ఉన్నాయి.

– డాక్టర్ మురళీధర్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తాం



మన జిల్లాలో ఇప్పటి వరకు కరోనా కేసులు నమోదుకాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలో వైద్యసేవల సామర్థ్యంపై రిపోర్టు అందించాం. వారి ఆదేశాలను పాటిస్తూ కరోనా చికిత్స అందిస్తాం. హోమ్ ఐసోలేషన్‌లో ఉండేవారికి, అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చేవారికి చికిత్స అందిస్తాం. అన్ని విధాలా సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు.

– డాక్టర్ సుమన్ మోహన్‌రావు, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్సై

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని గజసింగవరంలో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లో చోరీ జరిగింది. దుబ్బాక శంకరయ్య కుటుంబసభ్యులు సోమవారం ఇంటికి తాళం వేసి ఎల్లారెడ్డిపేటలో ఉంటున్న తన కొడుకు వద్దకు వెళ్లారు. బుధవారం ఇంటికొచ్చే సరికి తాళాలు పగులగొట్టి, ఇంట్లోని వస్తువులు చిందరవందర పడి ఉన్నాయి. రెండు గ్రాముల బంగారం, రూ.3వేల నగదు చోరీకి పాల్పడినట్లు వివరించారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై మహేశ్ సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

31 వరకు స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థులు 2023–24 విద్యాసంవత్సరానికి ఈపాస్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 వరకు అవకాశం ఉందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ బుధవారం తెలిపారు. విద్యార్థులు సకాలంలో దరఖాస్తులు చేసుకునేలా ఆయా కళాశాలల యాజమాన్యాలు చొరవ తీసుకోవాలని సూచించారు.

కుక్కల దాడిలో 9 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్ వాసి కుంట్ల పెంటయ్యకు చెందిన గొర్రెల మందపై కుక్కలు బుధవారం దాడి చేశాయి. షెడ్డులో ఉన్న మందపై ఊరకుక్కలు దాడి చేసి విచక్షణరహితంగా కొరికివేశాయి. దీంతో 9 గొర్రెలు మృత్యువాత పడగా.. మరో ఐదు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. రూ.50వేల నష్టం జరిగిందని బాధితుడు పెంటయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. పోతుగల్‌లో ఇరవై రోజుల క్రితం పది మందిపై దాడి చేసి కరువగా.. తాజాగా గొర్రెలమందపై కుక్కలు దాడి చేయడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధిత గొర్రెల కాపరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రాజన్న ఆలయంలో నర్సంపేట ఎమ్మెల్యే



కోడెమొక్కులు చెల్లిస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్నను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

చలో 'గురుకులం'

- 5వ తరగతి ప్రవేశాలు షురూ
- ఇంగ్లిష్ మీడియంలో బోధన
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- జనవరి 6 వరకు గడువు
- ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 23 గురుకులాలు.. 1,840 సీట్లు

కరీంనగర్: గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఇంగ్లిష్ మీడియంలో విజయవంతంగా నడుస్తున్న గురుకులాల పాఠశాలల్లో ప్రవేశాలకు కొన్నేళ్లుగా తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని 23 గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి 1,840 సీట్లు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో 5, జగిత్యాల 5, పెద్దపల్లి 6, రాజన్న సిరిసిల్లలో 7 ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో చింతకుంట, హుజూరాబాద్, జమ్మికుంట, మానకొండూర్, మల్లాపూర్, జగిత్యాల జిల్లాలో మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, గొల్లపల్లి, పెద్దపల్లి జిల్లాలో మంథని, గోదావరిఖని, రామగుండం, నందిమేడారం, మల్లాపూర్, గొల్లపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాలో బద్దెనపల్లి, వేములవాడ, చిన్నబోనాల, బోయిన్‌పల్లి, ముస్తాబాద్, నర్మాల, ఇల్లంతకుంటలో గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈనెల 18 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1 లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించరాదు.

ఉమ్మడి జిల్లాలో 1,840 సీట్లు..

ఉమ్మడి జిల్లాలోని 23 గురుకులాల్లో 5వ తరగతిలో ఒక్కొక్క పాఠశాలలో 80 సీట్ల చొప్పున 1,840 సీట్లు ఉన్నాయి. ప్రైవేటుకు దీటుగా విద్యాబోధనతో పాటు, భోజనవసతితో పాటు సకల వసతులు ఉంటాయి. ఎస్సీలకు 65 సీట్లు, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలకు 15 సీట్ల చొప్పున కేటాయించారు. ఒక్కసారి ప్రవేశం పొందితే 12వ తరగతి వరకు ఉచితంగా చదువు, హాస్టల్‌తో పాటు అన్నిరకాల వసతులు కల్పిస్తారు. బట్టలు, పుస్తకాలు, కాస్మోటిక్ చార్జీలు అందించనున్నారు.

జనవరి 6 వరకు దరఖాస్తు గడువు

5వ తరగతి ప్రవేశం పొందే విద్యార్థులు దరఖాస్తులను http://ttwreis.in, http:// tgcet. cgg.gov.in, http:/tgtwgurukulam.telangana.gov.in, http:/mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా 6 జనవరి 2024 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఒక ఫోన్‌నంబరుతో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవచ్చు. వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే వారిపై సెక్షన్ 416 ఐపీసీ 1,860 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. 2023లో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని జిల్లాల్లో గుర్తించిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుంది.



అదిరిపోయే మెనూ..

- వారానికి నాలుగురోజులు కోడిగుడ్లు, ఆరు రోజులు పండ్లు
- ఒకటో, మూడో, ఐదో ఆదివారం చికెన్
- రెండో, నాల్గో ఆదివారం మటన్
- ప్రతిరోజు నెయ్యి, పాలు
- సాయంత్రం లేదా రాత్రి భోజన సమయంలో స్నాక్స్
- వారంలో కనీసం నాలుగైదు రకాల ఆకుకూరలు, ఎనిమిది రకాల కూరగాయలతో కూరలు
- ప్రతి శనివారం స్వీట్లు

పేద విద్యార్థులకు వరం

గురుకుల పాఠశాలలు పేద విద్యార్థులకు వరం. నాణ్యమైన భోజనం అందించడంతోపాటు ఇంగ్లిష్ మీడియం బోధన కావడంతో పాఠశాలల్లో ప్రవేశాలకు పోటీ నెలకొంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.
– శ్రీనివాస్‌రెడ్డి, గురుకులాల రీజనల్ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్

మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

గంభీరావుపేట(సిరిసిల్ల): మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న 27 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ కానున్నాయి. జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటిలో 27 మినీ అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉన్నాయి. వెయ్యి మంది జనాభా ఉన్న ప్రాంతానికి ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, అంతకంటే తక్కువ జనాభా ఉన్న చోట మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాలలో అంగన్‌వాడీ టీచర్ ఒక్కరే ఉంటారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడం, సర్వేలు, సమావేశాలకు హాజరుకావడం ఇబ్బందిగా మారడంతో ప్రభుత్వ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ప్రధాన అంగన్‌వాడీ టీచర్‌కు రూ.13,650 వేతనం ఇస్తుండగా.. మినీ అంగన్‌వాడీ టీచర్లకు రూ.7,800 ఇస్తున్నారు. అప్‌గ్రేడ్ కావడంతో వీరికి కూడా ఇకపై ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల టీచర్ల మాదిరిగా వేతనాలు అందనున్నాయి. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ జిల్లాలోని 27 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు టీచర్లకు వేతనాలు పెరుగనున్నాయి. ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తాం.

కన్నీరుపెట్టిన చింతల్‌ఠాణా

- ఇద్దరి మృతితో రెండు కుటుంబాల్లో తీరని విషాదం
- క్షతగాత్రులు 11 మంది
- ఆస్పత్రిలో ఆరుగురు.. ఐదుగురి డిశ్చార్జ్



చింతాల్‌ఠాణాలో కుర్ర బాలవ్వ అంత్యక్రియలు



మల్లవ్వ అంత్యక్రియలు

వేములవాడఅర్బన్: రెక్కాడితేగానీ డొక్కాడని వ్యవసాయ కూలీలు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో సర్వం కోల్పోయారు. వారికి వ్యవసాయం తప్ప మరో పనిరాదు. తమ గ్రామం నుంచి వేరే గ్రామానికి పనికి వెళ్లి వస్తుండగా ఆటో బోల్తాపడిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో 11 మంది గాయపడ్డారు. ఇద్దరి మృతితో చింతలఠాణా గ్రామం కన్నీరు పెట్టింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చింతాల్‌ఠాణా గ్రామం మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో మునిగింది. దీంతో వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులో చింతాల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు. ఆ కాలనీలో పలు కుటుంబాలు ఇళ్లు నిర్మాణం చేసుకుని జీవనం సాగిస్తున్నాయి. వీరికి వ్యవసాయ భూములు లేవు. కూలీ పనులు చేస్తే గానీ పొట్టగడవని వీరు ఆటోలపై వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. ఈక్రమంలో మంగళవారం చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామ శివారులో వరినాటు కోసం ఆటోలో 13 మంది కూలీలు వెళ్లారు. సాయంకాలం తిరిగి వస్తుండగా వేములవాడరూరల్ మండలం నాగయ్యపల్లి వద్ద ఆటోకు ఎదురుగా కోతి అడ్డు వచ్చింది. కోతిని తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఆటోలో ఉన్న జాతరగొండ మల్లవ్వ, కుర్ర బాలవ్వ మృతి చెందారు. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారు వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఐదుగురు డిశ్చార్జ్ కాగా, ఆరుగురు చికిత్స పొందుతున్నారు.

గ్రామంలో విషాదఛాయలు

ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందడంతో చింతల్‌ఠాణాలో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామంలో ఎక్కడ చూసినా కన్నీరు పెట్టడం కలచివేసింది. అంత్యక్రియల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అందరితో కలివిడిగా ఉండే మల్లవ్వ, బాలవ్వ మృతిని జీర్ణించుకోలేకపోతున్నారు. మృతురాలు మల్లవ్వకు ముగ్గురు కూతుళ్లు, భర్త ఉండగా, ఇద్దరు కూతుళ్లకు వివాహమైంది. బాలవ్వకు కూతురు, కుమారుడు, భర్త ఉన్నారు. కూమారుడు, కూతురుకు పెళ్లిళ్లు అయ్యాయి. కాగా ఇద్దరు మృతి, 11 మంది ఆసుపత్రి పాలవడంతో గ్రామం కన్నీటిపర్యంతమైంది.

విలీనం రద్దుపై కేటీఆర్ రాజకీయం

- కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ



మాట్లాడుతున్న కృష్ణ

సిరిసిల్లటౌన్: అధికారంలో ఉండగా మంత్రి హోదాలో కేటీఆర్ సిరిసిల్ల చుట్టుపక్కల గ్రామాలను బలవంతంగా మున్సిపల్‌లో కలిపారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్చుతామని కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి కేటీఆర్ రాజకీయ లబ్ధి కోసమే విలీన గ్రామాలను పంచాయతీలుగా చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రొడ్డ భాస్కర్, తంగళ్లపల్లి అధ్యక్షుడు జాలుగం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన తొగరి రవికుమార్(30) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి, పోలీసులు తెలిపిన వివరాలు. లక్ష్మి భర్త అనారోగ్యంతో పదేళ్లక్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కూతురుకు వివాహమైంది. రవికుమార్‌కు కొద్ది నెలల నుంచి ఆరోగ్యం బాగ లేకపోవడంతో చికిత్స చేయిస్తున్నారు. ఆరోగ్యం బాగలేదని మనోవేదన చెంది రవికుమార్ గురువారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

గంజాయి పట్టివేత

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పరిధి కొత్తపల్లిలో ఇద్దరు మహిళల నుంచి 6.366 కిలోల గంజాయి పట్టుబడడం బుధవారం కలకలం రేపింది. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరరావు వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన ఓ మహిళ వద్ద 243 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టగా, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన మరో మహిళ వద్ద 6.123 కిలోల గంజాయి పట్టుబడింది. ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి జమ్మికుంట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

'ఫోర్జరీతో రూ.26లక్షలు లూటీ'



ప్రెస్‌మీట్లో మాట్లాడుతున్న జగన్‌గౌడ్

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు తమ భాగస్వామిని సినిమా ఫక్కీలో మోసం చేసిన ఘటన జిల్లా కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. ఈమేరకు సిరిసిల్లకు చెందిన గుగ్గిళ్ల జగన్‌గౌడ్ బుధవారం ప్రెస్‌మీట్లో తన గోడు వెళ్లబోసుకున్నాడు. సిరిసిల్ల సెస్‌డైరెక్టర్ భర్త, బీఆర్‌ఎస్ నాయకుడు దిడ్డి శ్రీనివాస్, తాను చాలా ఏళ్లుగా పలు విద్యాసంస్థల్లో భాగస్వాములుగా ఉంటున్నామని పేర్కొన్నారు. రాజరాజేశ్వరీ ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో అకౌంట్ నిర్వహిస్తున్నామని వివరించారు. ఇటీవల కొద్ది రోజులు తాను అమెరికాలో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లానని, సెప్టెంబర్ 10 నుంచి అక్టోబర్ 13 వరకు అమెరికాలో ఉండగా.. తన సంతకాలను ఫోర్జరీ చేసి వికాస్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన అకౌంటు నుంచి రూ.26లక్షలు విత్‌డ్రా చేసుకుని వాడుకున్నారని ఆరోపించారు. ఈవిషయమై శ్రీనివాస్‌ను నిలదీయగా, ×ఏమి చేసుకుంటావో చేసుకో× అంటూ భయపెడుతున్నట్లు బాధితుడు తెలిపారు. డబ్బులు డ్రా చేయడమే కాకుండా రాజరాజేశ్వరీ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులవి ఏడుగురు సంతకాలను కూడా ఫోర్జరీ చేసి అకౌంటును తొలగించాడని తెలిపారు. ఈనెల 15న పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదైనట్లు వెల్లడించారు. సొసైటీలో దిడ్డి శ్రీనివాస్ భార్య సిరిసిల్ల సెస్ డైరెక్టర్ దిడ్డి రమ కూడా సభ్యురాలిగా ఉందని తెలిపారు. ఇద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. జగన్‌గౌడ్‌కు తంగళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు టోని, టీడీపీ సిరిసిల్ల అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, చెరుపల్లి శివ తదితరులు మద్దతు తెలిపారు.

గృహలక్ష్మిపై బెంగ

- ఇందిరమ్మ ఇళ్లపై ఆసక్తి
- సంక్రాంతికి ప్రకటన వచ్చే అవకాశం
- జిల్లాలో 21,368 గృహలక్ష్మి దరఖాస్తులు
- 2,833 మందికి ప్రొసీడింగ్స్
- ఆందోళనలో లబ్ధిదారులు



ముస్తాబాద్‌లో గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందుకున్న లబ్ధిదారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పేదల సొంతింటి కల నెరవేరడంపై సందిగ్ధత నెలకొంది. గత ప్రభుత్వం ఇచ్చిన గృహలక్ష్మి పథకంపై నీలినీడలు కమ్ముకునేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు నెల రోజుల ముందు జిల్లాలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు. ఈనేపథ్యంలో జరిగిన ఎన్నికలలో బీఆర్‌ఎస్ ఓటమి పాలుకావడం.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గృహలక్ష్మి లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. తాజాగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంక్రాంతి పండుగ నాటికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

జిల్లాలో వెలువెత్తిన దరఖాస్తులు

రెండు పడకల ఇళ్లకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3లక్షల చొప్పున అందజేస్తామని, సొంత స్థలం ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో జిల్లాలో 21,368 మంది దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసిన అధికారులు 13,942 మంది అర్హులని తేల్చారు. ఇందులో 2,833 మందికి ప్రొసీడింగ్స్ అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ప్రముఖమైనది. నిరుపేదలకు లక్షల సంఖ్యలో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. తెలంగాణ స్వరాష్ట్రం అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఇచ్చింది. కొన్ని గ్రామాల్లో ఈ పథకం అమలైనా క్షేత్రస్థాయిలో స్థలం లభించకపోవడం, ప్రభుత్వం అందించే రూ.5లక్షలు సరిపోక కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. దీంతో కేసీఆర్ హామీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇందిరమ్మ ఇళ్లపై పేదల్లో ఆశలు చిగురించాయి. ఎన్నికల మేనిఫెస్టోలో రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించారు. తాజాగా గృహనిర్మాణ, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంక్రాంతికి ముందే ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు.


జిల్లాలో గృహలక్ష్మి దరఖాస్తులు ఇలా..

మండలం	దరఖాస్తులు	అర్హులు	ప్రొసీడింగ్స్
సిరిసిల్ల	2,577	2,012	227
ముస్తాబాద్	1,453	792	312
తంగళ్లపల్లి	1,889	745	159
గంభీరావుపేట	2,255	1,269	252
ఎల్లారెడ్డిపేట	2,580	1,937	452
వీర్నపల్లి	1,145	885	325
వేములవాడ	1,300	757	119
వేములవాడ(ఆర్)	850	663	242
కోనరావుపేట	1,757	1,150	172
చందుర్తి	1,238	955	249
రుద్రంగి	416	284	02
వేములవాడఅర్బన్	823	591	322
బోయినపల్లి	1,314	503	449
ఇల్లంతకుంట	1,771	1,269	0

పాత దరఖాస్తులకు మోక్షం లభించేనా..

జిల్లాలో గృహలక్ష్మి పథకం కోసం 21,368 మంది దరఖాస్తు చేసుకోగా.. ఇప్పుడు కొత్తగా తిరిగి దరఖాస్తు చేయాలనే మీమాంస పేదల్లో ఉంది. జిల్లాలో గృహలక్ష్మి ప్రొసిడింగ్స్‌ను 2,833 మందికి అందించారు. వారు ఎలాంటి నిర్మాణ పనులు ఇప్పటికీ చేపట్టలేదు. మరోవైపు ఎన్నికలు వచ్చాయి. పాలకులు మారారు. కొత్తగా వస్తున్న ఇందిరమ్మ ఇళ్లపై మార్గదర్శకాల కోసం వేచిచూస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. సంక్రాంతి పండగ మరో నెల రోజులు మాత్రమే ఉండగా.. దరఖాస్తుల ప్రక్రియ, పరిశీలన చేపట్టాల్సి ఉంది.

గుడిసెలో ఉంటున్నాం



గుడిసెలో ఉంటున్నాం. గృహలక్ష్మి పథకం కింద సార్లు కాయితాలు ఇచ్చిండ్రు. ఇల్లు కట్టుకుంటామని అనుకున్న. గప్పుడే ఓట్లు వచ్చినై. ఇల్లుకు రూ.3లక్షలు వస్తయి అన్నారు. ఇప్పుడు ఇల్లు కడుదామంటే సార్లు ఏం చెప్తలేరు. ఇందిరమ్మ ఇల్లయిన మంజూరు చేయాలే.
– దొక్కా లక్ష్మి, ముస్తాబాద్

రేకుల ఇంట్లో ఉంటున్నాం



రెండు నెలల కింద గృహలక్ష్మి పట్ట కాయితం ఇత్తే ఎంతో సంతోషపడ్డం. ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లు అంటున్నరు. ఏం సమజు అయితలేదు. ఇందిరమ్మ ఇల్లుకు కొత్తగా దరఖాస్తు పెట్టుకోవాలో.. లేదో తెలియదు. ఇల్లు పని మొదలు పెట్టలేదు. సార్లు మమ్మల్ని ఆదుకోవాలే.
– విభూది రాజ్యాలక్ష్మి, ముస్తాబాద్

ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు



గృహలక్ష్మి దరఖాస్తులు స్వీకరించాం. అర్హులను గుర్తించి కొంతమందికి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చాం. అయితే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇంకా మాకు మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటే దానిని అమలు చేస్తాం.
– రమాదేవి, ఎంపీడీవో, ముస్తాబాద్

వేతనాలు ఇవ్వాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవో మధుసూదన్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

వేములవాడఅర్బన్: వేతనాలు అందించాలని వేములవాడ ఆర్డీవో మధుసూదన్‌కు వీఆర్‌ఏలు బుధవారం విన్నవించారు. పూర్వ వీఆర్‌ఏల ఐక్యకార్యాచరణ కమిటీ జిల్లా చైర్మన్ చందు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారం అర్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 81 జీవో ద్వారా జిల్లాలో 370కి పైగా పూర్వ వీఆర్‌ఏలను జూనియర్ అసిస్టెంట్లుగా, రికార్డ్ అసిస్టెంట్లుగా, ఆఫీస్ సబార్డినేట్లుగా, హెల్పర్లుగా, రెవెన్యూ మున్సిపల్, మిషన్ భగీరథ ఇరిగేషన్ శాఖలో క్రమబద్ధీకరించారని తెలిపారు. క్రమబద్ధీకరించి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. నాయకులు రాజేందర్, తిరుపతి, సుధీర్ మంజుల తదితరులు ఉన్నారు.

నేడు జిల్లాస్థాయి యువజనోత్సవాలు

- జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి అజ్మీరా రాందాస్

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో గురువారం యువకళాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి అజ్మీరా రాందాస్ బుధవారం తెలిపారు. స్థానిక మినీస్టేడియంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జానపద నృత్యాలు(బృందంగా), జానపద నృత్యం(సోలో), జానపద గేయం(బృందం), లైఫ్‌స్కిల్స్ కాంపోనెంట్, కథారచన, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ రంగాల్లో ఆసక్తి గల యువతీయువకుల మధ్య పోటీలు ఉంటాయని వివరించారు. జిల్లాకు చెందిన 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీల్లో ఎంపికైన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయిలో జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు, సిటీకాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-223]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-793665]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీకేర్‌టేకర్స్, లేడీనర్సులు, కాంపౌండర్స్, ఆయాలు భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12583]

CHANGE OF NAME

■ DHARMAPURI KALYANI W/o REVANTH, H.No: 8-2-94, Siricilla (T), Siricilla(M), Rajanna Siricilla Dist, T.S., I have changed my Name as ADEPU KALYANI (New name), W/o ADEPU REVANTH [K-1187278]

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర:: 9177736926. [M-1167554]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824